
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



టమాట కిలో రూ.23

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టం రూ.5, సరాసరి ధర రూ.10 ప్రకారం అమ్మకాలు జరిగాయి.



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 43 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
31.9°/17.1°

జిల్లా పరిధిలో మంగళవారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమవుతుందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాలోని 32 మండలాలకు చెందిన 2,66,038 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.73.82 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ మొత్తాన్ని ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల ఖాతాలకు జమ చేయగా మంగళవారం సాయంత్రమే వారు డ్రా చేసి సిద్ధంగా ఉంచుకున్నారన్నారు. జిల్లాలో ఐదురోజుల పాటు వందశాతం పింఛన్ల పంపిణీ చేస్తామన్నారు.

'ఉపాధి' పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



పనులను పరిశీలిస్తున్న రామాంజనేయులు

చెన్నేకొత్తపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య మరింత పెంచాలని డ్వామా పీడీ రామాంజనేయులు సూచించారు. మంగళవారం ఆయన చెన్నేకొత్తపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు పూర్తయ్యాయని, అందువల్ల కూలీలు వలస వెళ్లకుండా స్వగ్రామాల్లోనే పనులు కల్పించాలన్నారు. అదే విధంగా ప్రతి కూలికి కనీస వేతనం రూ.257 తగ్గకుండా చూడాలన్నారు. కూలీల జాబ్ కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేయాలన్నారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ వారికి ఇచ్చిన లక్ష్యం పూర్తి చేయాలన్నారు. డ్వామా పీడీ వెంట ఏపీఓ శంకర తదితరులు ఉన్నారు.

క్రిమినల్ కేసులకు పరిష్కారం చూపాలి



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

అనంతపురం: క్రిమినల్ కేసులు పరిష్కరించే దిశగా కృషి చేయాలని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి దీనబాబు ఆదేశాలు జారీ చేశారు. అనంతపురంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్ప, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, ఇతర పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు సింహభాగం పరిష్కరించాలని కోరారు.

సింహ వాహనంపై కొండమీద రాయుడు



బుక్కరాయసముద్రం: కొండమీదరాయుని బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి స్వామి వారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మండల కేంద్రంలోని పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఊరేగించారు. మహిళలు శ్రీవారికి మంగళహారతులు పట్టారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బుధవారం రాత్రి శ్రీవారిని శేష హనంపై ఊరేగించనున్నారు.

గంజాయి కేసులో ముద్దాయికి శిక్ష

అనంతపురం: గంజాయి విక్రయ కేసులో ముద్దాయి బోయ ఓబుళపతికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ అనంతపురం మొదటి అదనపు జిల్లా జడ్జి రమేష్ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. 2019 అక్టోబర్ 11న అప్పటి ఉరవకొండ ఎస్‌ఐ తమకందిన సమాచారం మేరకు.. గవి మఠం పరిసరాల్లో సోదాలు చేయగా బోయ ఓబుళపతి వద్ద 700 గ్రాముల గంజాయి లభించింది. అతన్ని అదుపులో తీసుకుని విచారణ చేయగా కొంత మంది గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర రూ.5 వేలకు కొన్నానని, కొంత తన పెట్టి అంగడిలో పెట్టి మిగిలిన దాన్ని సాధువులకు, లారీ డ్రైవర్లకు విక్రయించానని చెప్పాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. విచారణలో భాగంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఐదుగురు సాక్షులను విచారించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఎస్.రమేష్ తీర్పు వెలువరించారు.

దోపిడీకి చికిత్స



సర్కారీ వైద్యమిలా...

- 24 గంటలు సేవలందించే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, పల్లెల్లో 104 సేవలు...ముంగిళ్లలోనే వైద్య సేవలందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్లు...ఇలా ప్రభుత్వం వైద్య సేవలను చేరువ చేసింది. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అత్యాధునిక పరికరాలు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచింది.
- ఇటీవల కలెక్టర్ బసంత్‌కుమార్ తన మనవడు విరాజ్‌కు వైరల్ ఫీవర్ వస్తే పుట్టపర్తి నగర పంచాయతీ పరిధిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. ఇలా జిల్లాలోని పలువురు అధికారులు, ప్రముఖులు ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకుంటున్నారు.



హిందూపురం జిల్లా ఆస్పత్రిలో ఓపీ కౌంటర్ వద్ద బారులు తీరిన జనం

ప్రైవేటు దోపిడీ ఇలా..

- మోకాళ్లనొప్పులకు వైద్యం చేస్తానంటూ నకిలీ వైద్యుడు రామనాథ్‌రెడ్డి సూది మందు వేయడంతో అది వికటించి ఇటీవల ఓడీసీ మండలం టి.కుంట్లపల్లికి చెందిన ఇద్దరు, బసప్పగారిపల్లికి చెందిన ఒకరు మృతి చెందారు. మృతుల కుటుంబాలలో తీవ్ర విషాదం నెలకొంది.
- కొత్త చెరువులో అర్హత లేకున్నా గుర్రం కిరణ్ అనే వ్యక్తి చిన్నపిల్లలకు వైద్యం చేస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడాడు. తెలిసీ తెలియకుండా ఆయన చేసిన వైద్యంతో ఎందరో ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. స్థానికులు ఫిర్యాదు చేయగా కలెక్టర్ స్పందించి వైద్యఆరోగ్యశాఖతో విచారణ చేయించడంతో ఈ నకిలీ వైద్యుడి గుట్టు రట్టయ్యింది.

ప్రభుత్వ వైద్యానికే జనం మొగ్గు

- సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో 24 గంటల సేవలు
- 104, ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలతో పల్లె ముంగిటకే వైద్యం
- అందుబాటులో మందులు, అధునాతన యంత్రాలతో చికిత్స
- అక్కడక్కడా కొనసాగుతున్న 'ప్రైవేటు' దందా
- పల్లెల్లో నకిలీ డాక్టర్ల బారిన పడుతున్న గ్రామీణులు
- అవగాహన కల్పిస్తూ దోపిడీకి చికిత్స చేస్తున్న వైద్యఆరోగ్య శాఖ



ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తన మనవడికి వైద్యం చేయిస్తున్న కలెక్టర్ బసంత్ కుమార్ (ఫైల్)



కొత్తచెరువులో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న చిన్న పిల్లల ఆస్పత్రిని సీజ్ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నివేదిత బృందం (ఫైల్)

ప్రశాంతి నిలయం : ప్రభుత్వ వైద్యానికి జగన్ సర్కార్ ప్రాణం పోసింది. భారీగా నిధులు కేటాయించడంతో పాటు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చింది. 'నాడు- నేడు'తో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఖాళీలు భర్తీ చేసి వైద్యులను అందుబాటులోకి తెచ్చింది. అందువల్లే ఇప్పుడు పల్లె, పట్నం తేడా లేకుండా అందరూ సర్కారు దవాఖానా బాట పడుతున్నారు. అందువల్లే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్న వారి సంఖ్య గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది.

కార్పొరేట్ హంగులు..

వైఎస్ జగన్ సర్కార్ 'నాడు- నేడు' పథకం కింద రూ.కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించింది. కార్పొరేట్‌కు దీటుగా సేవలు అందేలా చర్యలు చేపట్టింది. మూడేళ్లలోనే అన్ని విభాగాల్లో 46 వేల పోస్టులు భర్తీ చేసింది. ఫలితంగా వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బంది అందుబాటులోకి రావడంతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో

జిల్లాలో 24 గంటలూ సేవలందించే ప్రభుత్వ వైద్యశాలల వివరాలు	
ఆస్పత్రి స్థాయి	సంఖ్య
జిల్లా ఆస్పత్రి	1
ఏరియా ఆస్పత్రులు	3
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	7
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	36

నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి.

ఫ్యామిలీ ఫిజీషియన్, 104 సేవలతో ప్రైవేటుకు కళ్లెం

రోగుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని గతంలో ప్రైవేటు వైద్యులు భారీగా దోచేసేవారు. టెస్టులు, ఇతర వైద్య సేవల కోసం రూ. వేలు వసూలు చేసేవారు. ఏ రోగానికి ఎలాంటి టెస్టు చేస్తారో తెలియని చాలా మంది వైద్యుడు సూచించిన టెస్టులన్నీ చేయించుకునేవారు. ఫలితంగా వైద్యానికే భారీగా వెచ్చించాల్సి వచ్చేది. కొందరు అప్పులపాలయ్యారు. ఈ ప్రైవేటు దోపిడీకి కళ్లెం వేసేందుకు ప్రభుత్వం 104 సేవలతో పాటు ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేస్తోంది. ఫలితంగా గ్రామీణుల ముంగిళ్లలోనే వైద్య సేవలతో పాటు మందులు కూడా ఉచితంగా అందుతుండటంతో జనమంతా జగన్ సర్కారు తీరును అభినందిస్తున్నారు.

అక్కడక్కడా ఆగని దందా..

జిల్లాలో ఇంకా అక్కడక్కడా కొందరు ప్రైవేటు వైద్యులతో పాటు వైద్యుల అవతార మెత్తిన నకిలీగాళ్లు రోగులను భయపెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అవసరం లేకపోయినా పరీక్షల పేరిట ఎడా పెడా ఫీజుల వసూలు చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇక కొందరు వైద్యులు తమకు పేరు రావాలన్న లక్ష్యంతో మోతాదుకు మంచి మందులు ఇస్తుండడంతో రోగులు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏ టెస్టుకు ఎంత వసూలు చేస్తారు. వైద్య సేవలు, డాక్టర్ ఫీజు ఎంత మేర వసూలు చేస్తారో తెలుపుతూ ఆస్పత్రి రిసెప్షన్ ఎదుటే బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా...చాలా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ బోర్డులు కనిపించడం లేదు.

మెరుగైన వైద్య సేవలందిస్తాం



జిల్లా వాసులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన పరికరాలు అందుబాటులోకి తెచ్చాం. అన్ని రకాల మందులు, స్పెషలిస్టు వైద్యులనూ అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రైవేటు వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అర్హత లేని వారు ఎవరైనా వైద్య సేవలందిస్తే చట్ట రీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

– ఎస్. వెంకట కృష్ణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

అర్హులందరికీ పథకాలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ధర్మవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని కలెక్టర్ బసంత్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం, పార్థసారథినగర్ -1, 2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విజిటర్స్ రిజిస్టర్ ఖాళీగా ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రిజిస్టర్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలని, ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ సచివాలయ వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా సచివాలయాల ఉద్యోగులతో మాట్లాడి వారికి నిర్దేశించిన లక్ష్యం...ఇప్పటి వరకూ సాధించిన ప్రగతిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, వార్డుల కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తంరెడ్డి, మేడాపురం వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపాటి రామకృష్ణ, సచివాలయాల అడ్మిన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

'సాఫ్ట్‌వేర్' కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సు ప్రారంభిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూమ్, జాబ్ కోఆర్డినేటర్ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుక్కపట్నం డిగ్రీ కళాశాలలో సిల్క్ హబ్ ఏర్పాటు చేసి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో కోర్సు నిర్వహిస్తారన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత, డిగ్రీ ఆపై ఉన్నత చదువులు అభ్యసించిన యువతీయువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు 9640899337 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లింపునకు 15 తుది గడువు

అనంతపురం: ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించడానికి ఫిబ్రవరి 15 తుదిగడువుగా నిర్దేశించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్ నాయక్ తెలిపారు. పదో తరగతి థియరీ ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్‌లో ఒక్కో సబ్జెక్టుకు రూ.250 చొప్పున చెల్లించాలని విద్యార్థులకు సూచించారు. మరిన్ని వివరాల కోసం https://apopenschool. ap.gov.in వెబ్‌సైట్ సందర్శించాలన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి

- వీసీలో ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్



వీసీలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని కొంతమంది పోలీస్ అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయం నుంచి అన్ని మండలాల పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్కిల్ వారీగా కేసుల సంఖ్య, దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. ఆయా కేసుల దర్యాప్తుపై దిశానిర్దేశం చేశారు. అనంతరం జనవరి నెలలో జరిగిన నేరాలపై సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడకూడదన్నారు. గుట్కా, మట్కా, పేకాట, చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా మహిళలపై దాడులు జరిగితే వేగంగా స్పందించాలన్నారు. పోక్సో కేసుల్లో అలసత్వం పనికిరాదన్నారు. అలాగే నిందితుల అరెస్టు విషయంలోనూ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఏ మాత్రం అతిక్రమించినా... చర్యలు తప్పవన్నారు. పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగేలా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా ఇసుక జిల్లా సరిహద్దు దాటిపోకూడదన్నారు. ఈ మేరకు సరిహద్దులో ఉన్న స్టేషన్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన పిటీషనర్లతో మర్యాదగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కీలక కేసుల్లో ఘటనా స్థలంలో సేకరించే ఆధారాలే దర్యాప్తులో కీలకంగా మారతాయని, అందువల్ల సక్రమంగా, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ఆధారాలు సేకరించాలన్నారు. సాంకేతికతను విరివిగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సీఐ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటకృష్ణారెడ్డి



నూతన పీహెచ్‌సీలో వసతులపై ఆరాతీస్తున్న జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి

తలుపుల: గ్రామీణ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.వెంకట కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ద్వారా అందుతున్న వైద్యసేవలు తెలుసుకున్నారు. గర్భవతుల, బాలింతలకు మెరుగైన సేవలందించాలని, మాతా శిశు సంరక్షణపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం కస్తూర్బా గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ... విద్యార్థుల వ్యక్తిగత ఆరోగ్యం, భోజన, వసతి సౌకర్యాలపై ఎస్‌ఓ మోహనమ్మను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రఫీ నాయక్ జిల్లా వైద్యాధికారిని సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఐనొద్దీన్ ఖాన్, వైద్యాధికారి రోజా పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు కళకళ.. కాసుల గలగల

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఆదాయం (ఏప్రిల్ - డిసెంబరు)			
కార్యాలయం	వార్షిక లక్ష్యం (రూ.కోట్లలో)	వసూలు (డిసెంబరు వరకు)	శాతం
బుక్కపట్నం	12.04	13.75	114
చిలమత్తూరు	12.18	10.69	87.79
చెన్నేకొత్తపల్లి	4.11	3.64	88.59
ధర్మవరం	27.64	27.80	100.58
హిందూపురం	32.41	27.93	86.2
కదిరి	18.98	18.69	98.46
మడకశిర	6.42	4.05	63.06
పెనుకొండ	9.54	12.60	132.15
తనకల్లు	2.53	1.67	66.01
మొత్తం	125.89	120.87	96.01



పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు కాగానే రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. అలాగే క్రయ విక్రయాలూ పెరిగాయి. దీంతో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ కళకళలాడాయి. స్టాంపు ఫీజు రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరే మొత్తమూ భారీగా పెరిగింది.

- వార్షిక లక్ష్యంలో 96 శాతం వసూలు
- పెనుకొండ, బుక్కపట్నంలో లక్ష్యానికి మించి..
- మడకశిర, తనకల్లు కార్యాలయాల్లో అత్యల్పంగా..

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతుండగా, ప్రభుత్వానికీ రాబడి పెరుగుతోంది. జిల్లా ఏర్పడిన నాటి నుంచి (2022 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు) 9 నెలల రికార్డులను పరిశీలిస్తే లక్ష్యానికి చేరువగా ఆదాయం వచ్చింది. గత జూలైలో ఆషాఢ మాసం కావడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గినా.. తర్వాత శ్రావణ మాసంలో పుంజుకుంది. వార్షిక లక్ష్యంలో డిసెంబరు నాటికే 96 శాతం మేర వసూలైనట్లు రిజిస్ట్రార్ కార్యాలయ గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. పెనుకొండ, బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లక్ష్యానికి మించి రాబడి రాగా.. మడకశిర, తనకల్లులో అత్యల్పంగా ఆదాయం వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2022 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు మొత్తం 56,680 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా, ప్రభుత్వానికి రూ.120.87 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

కదిరిలో ఎక్కువ డాక్యుమెంట్లు..

కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2022 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 12,690 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ జరిగింది. హిందూపురంలో 10,917, ధర్మవరంలో 10,280, బుక్కపట్నంలో 5,083, చిలమత్తూరులో 4,759, పెనుకొండలో 4,668, మడకశిరలో 4,246, తనకల్లులో 2,138, సీకే పల్లిలో 1,899 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ చేశారు.

పెనుకొండలో లక్ష్యానికి మించి..

పెనుకొండ, బుక్కపట్నం, ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జోరుగా సాగడంతో వార్షిక టార్గెట్‌కు మించి ఆదాయం వచ్చింది. పెనుకొండలో 132.15 శాతం, బుక్కపట్నంలో 114.17 శాతం, ధర్మవరంలో 100.58 శాతం మేర వసూలైంది. కదిరిలో 98.46 శాతం, సీకే పల్లిలో 88.59, చిలమత్తూరులో 87.79, హిందూపురంలో 86.2, తనకల్లులో 66.01, మడకశిరలో 63.06 శాతం మేర లక్ష్యం పూర్తయింది.

హిందూపురంలో ఎక్కువ రాబడి..

జిల్లాలోని 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వార్షిక లక్ష్యం రూ.125.89 కోట్లు ఉండగా.. డిసెంబరు వరకు రూ.120.87 కోట్ల మేర వసూలైంది. అందులో హిందూపురం నుంచి రూ.27,93 కోట్లు, ధర్మవరం నుంచి రూ.27.80 కోట్లు, కదిరి నుంచి రూ.18.69 కోట్లు, బుక్కపట్నం నుంచి రూ.13.75 కోట్లు, పెనుకొండ నుంచి రూ.12.60 కోట్లు, చిలమత్తూరు నుంచి రూ.10.69 కోట్లు, మడకశిర నుంచి రూ.4.05 కోట్లు, సీకే పల్లి నుంచి రూ.3.64 కోట్లు, తనకల్లు నుంచి రూ.1.67 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

రిజిస్ట్రేషన్లు పెరిగాయి

గతంతో పోలిస్తే ఈసారి రిజిస్ట్రేషన్లు పెరిగాయి. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇప్పటికే వార్షిక లక్ష్యం కూడా దాటాయి. ఈ మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా, మిగతా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలూ లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది. – కృష్ణకుమారి, జిల్లా రిజిస్ట్రార్

క్లుప్తంగా

ఔషధ నియంత్రణ కార్యాలయం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన ఔషధ నియంత్రణ కార్యాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజనీ వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఇన్‌చార్జ్ ఔషధ నియంత్రణ అధికారి హనుమన్న, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ పాల్గొని లాంఛనంగా రిబ్బన్ కట్ చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి అనిల్, కోశాధికారి రాజేష్, కార్యవర్గ సభ్యులు, మెడికల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక



అనంతపురం సప్తగిరి సర్కిల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాల వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 త్రోబాల్ పోటీల్లో రన్నరప్ స్థానాన్ని జిల్లా బాలికల జట్టు దక్కించుకుంది. టోర్నీలో అత్యంత ప్రతిభ కనబరచిన ముగ్గురిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో దివ్య, ఇందు, అంకిత ఉన్నారు. వీరిని ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య, ఎస్జీఎఫ్ కార్యదర్శి రవికుమార్, కో–ఆర్డినేటర్ నాగరాజు అభినందించారు.

బలిజపేటలో చోరీ

తలుపుల: మండల కేంద్రంలోని బలిజ పేటలో నివాసముంటున్న బి.కిషోర్‌కుమార్ ఇంట్లో సోమవారం రాత్రి దుండగులు చొరబడి నగదు, విలువైన సామగ్రి అపహరించుకెళ్లారు. కిషోర్‌కుమార్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి తన పెద్దనాన్న దినకర్మ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్దన్నవారిపల్లికి వెళ్లాడు. విషయాన్ని గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.42 వేలు నగదు, 700 గ్రాముల వెండి ఆభరణాలు అపహించుకెళ్లారు. ఘటనపై బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మగ్బూల్‌బాషా తెలిపారు.

సాఫ్ట్‌గా వ్యవసాయం

- పంటల సాగులో ఆధునిక సాంకేతికత
- సౌర శక్తితోనే 16 ఎకరాల్లో దానిమ్మ పంట
- నల్లరేగడిలోనూ బిందు సేద్యం!
- విడతల వారీగా దిగుబడులు వచ్చేలా ప్రణాళిక
- దళారుల ప్రమేయం లేకుండా పంట ఉత్పత్తుల విక్రయాలు
- ఆదర్శప్రాయంగా నిలిచిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భువనేశ్వర చక్రవర్తి

శరీర కష్టం స్ఫురింపజేసే వ్యవసాయాన్ని తన మేధోశక్తితో చాలా నాజుకుగా మార్చేశాడు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆడుతూ.. పాడుతూ.. శరీర కష్టమనేది తెలియకుండా పంటల సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. అంతేకాక పంట దిగుబడులను నేరుగా ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు చేపట్టి దళారీ వ్యవస్థకు మంగళం పాడాడు. సరికొత్త ఆలోచనతో వ్యవసాయాన్ని సుసంపన్నం చేసిన భువనేశ్వర చక్రవర్తి విజయ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



మార్కెట్‌కు తరలించేందుకు బాక్స్‌లలో నింపుతున్న దానిమ్మ పండ్లు



దానిమ్మ తోటలో ఫసల్ సాంకేతిక పరికరాన్ని చూపుతున భువనేశ్వర చక్రవర్తి

బొమ్మగుప్ప: మండలంలోని తగ్గుపర్తి గ్రామానికి చెందిన దబ్బర నారాయణస్వామి, నిర్మల దంపతుల కుమారుడు భువనేశ్వర చక్రవర్తి.. బెంగళూరులోని ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ప్రతి నెలా ఐదంకెల జీతం అందుకుంటున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వర్క్‌ఫ్రమ్ విధానం ద్వారా ఇంటి వద్ద నుంచి పనిచేసే అవకాశం దక్కింది. ఈ క్రమంలో తగ్గుపర్తికి చేరుకున్న భువనేశ్వర చక్రవర్తి... పంటల సాగులో తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని కళ్లారా చూసి, చలించిపోయాడు. ఏదైనా చేసి శరీర కష్టం తెలియని వ్యవసాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని భావించాడు.

నల్లరేగడిలో పసిడి పంట

తమకున్న 16 ఎకరాల నల్లరేగడిలో సంప్రదాయ పంటలనే సాగు చేస్తూ నష్టాలను చవిచూస్తున్న తరుణంలో భువనేశ్వర ప్రసాద్ పంటల సాగుపై దృష్టి సారించాడు. అదే సమయంలో తండ్రి ఆకస్మిక మరణం ఆ కుటుంబాన్ని కుంగదీసింది. తీవ్ర వేదనలో ఉన్న తల్లి నిర్మలకు భువనేశ్వర్ అండగా ఉంటూ తనకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నల్లరేగడిలో బంగారు పంటలు పండించే మార్గాలను అన్వేషించాడు. ఆన్‌లైన్ అన్వేషణ ఫలించింది. మహారాష్ట్ర నుంచి భగువ రకం దానిమ్మ మొక్కలను తెప్పించి 2020లో ఆరు ఎకరాల్లో నాటాడు. విడతల వారీగా ఏడాది పొడవునా పంట దిగుబడి వచ్చేలా ప్రణాళిక రచించి మొత్తం 16 ఎకరాల్లో దానిమ్మ మొక్కలు నాటాడు. 2021లో 11 నెలలకే కాపు కాసిన దానిమ్మ పంట తొలి కాపులోనే ఆరు ఎకరాల్లో 26 టన్నుల దిగుబడి సాధించాడు. టన్ను రూ.60 వేలు నుంచి రూ.70 వేల వరకూ విక్రయించగా రూ.18 లక్షల ఆదాయం సమకూరింది. పెట్టుబడులకు రూ.4 లక్షలు పోను రూ.14 లక్షల నికర లాభం ఆర్జించాడు. అనంతరం ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించి 2022లో మరో ఆరు ఎకరాల్లో కాపు కాసిన దానిమ్మను సొంతంగా బెంగళూరులోని పలు అపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న వారికి సొంతంగా విక్రయించాడు. కిలో రూ.100 చొప్పున ఒక్కో అపార్ట్‌మెంట్‌కు వంద నుంచి 200 కిలోల వరకు బుక్ చేసుకుని ఐదు నుంచి పది కిలోల చొప్పున బాక్స్‌లను తోటలోనే ప్యాక్ చేయించి ఆర్టీసీ కార్గో సేవల ద్వారా బెంగళూరుకు తరలించేవాడు. రెండో విడత కాపులో 16 టన్నుల దిగుబడి సాధించి టన్ను రూ.90 వేల నుంచి రూ.1.10 లక్షల వరకూ విక్రయించాడు. ఈ లెక్కన రూ.16 లక్షల ఆదాయాన్ని గడించాడు. ఓ వైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే మరో వైపు తల్లికి చేదోడుగా నిలిచి పది మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాడు.

సూర్యరశ్మిని ఒడిసిపట్టి

పంటల సాగుకు అవసరమైన నీటిని అందించేందుకు సంప్రదాయ విద్యుత్తును కాకుండా సౌరశక్తిపై భువనేశ్వర చక్రవర్తి ఆధారపడ్డాడు. సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని సూర్యరశ్మిని ఒడిసిపట్టడం ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తుతో 16 ఎకరాల్లోని దానిమ్మ తోటకు బిందు సేద్యం ద్వారా నీటి తడులు అందిస్తూ వస్తున్నాడు. వన్యప్రాణుల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు రాత్రిళ్లు వివిధ రకాల శబ్దాలు వచ్చేలా తోటలో స్పీకర్లు అమర్చాడు. పంటను ఆశించే పండు ఈగలకు సోలార్‌లైట్‌తో ఎరలను ఏర్పాటు చేసాడు. దానిమ్మ పూలు మొత్తం ఫలదీకరణం చెందడానికి తోటలోనే తేనెటీగల పెంపకం చేపట్టాడు. దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన ఫసల్(ఎఫ్‌ఏఎస్‌ఏఎల్) యంత్రాన్ని రూ.50,000 ఖర్చుతో తోటలో అమర్చాడు. ఈ యంత్రానికి 13 రకాల సెన్సార్లు ఏర్పాటు చేసి శాటిలైట్ కనెక్టివిటితో వర్షసూచన, నేలలో తేమశాతం, పంటను ఆశించిన తెగుళ్లు, ఇతర సమాచారాన్ని తెలుసుకుంటున్నాడు.

ఏడాది మొత్తం దిగుబడే



వ్యవసాయ కూలీలతో పంటలో సస్యరక్షణ చర్యలు చేపడుతుంటాను. నా కుమారుడి ఆలోచన వల్ల ఏడాది పొడవునా దానిమ్మ పంట చేతికందుతోంది. గతంలో పంటసాగుకు చాలా కష్టపడేవాళ్లం. ఇప్పుడా శ్రమ లేకుండా పోయింది.
– నిర్మల, మహిళా రైతు, తగ్గుపర్తి

దళారీ వ్యవస్థ ఉండరాదు



పెద్ద కంపెనీలు సైతం దళారులతోనే పంట దిగుబడులను కొనుగోలు చేస్తున్నాయి. దీంతో పంట పండించిన రైతుకు కష్టం తప్ప ఆదాయం ఉండడం లేదు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం రైతు సంఘాలను ఏర్పాటు చేసి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలి. రైతులతో కంపెనీ ప్రతినిధులు నేరుగా సంప్రదించి పంట కొనుగోలు చేస్తే అన్నదాత కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుంది. – భువనేశ్వర చక్రవర్తి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, తగ్గుపర్తి

గ్రామంలోనే ఉపాధి



భువనేశ్వర చక్రవర్తి సాగు చేసిన దానిమ్మ తోటలో నాతో పాటు మరో ఎనిమిది మంది కూలి పనులకు వెళుతుంటాం. ఏడాది పొడవునా మాకు పని ఉంటుంది. మా కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతోంది.
– ప్రసాద్, వ్యవసాయ కూలీ, తగ్గుపర్తి గ్రామం

ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు



జ్యూస్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆహార భద్రత తనిఖీ అధికారి తస్లీమ్

హిందూపురం: ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత తనిఖీ అధికారి తస్లీమ్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం హిందూపురంలోని పలు దుకాణాలు, కూల్‌డ్రింక్‌షాపులు, బేకరిలు, జనరల్‌స్టోర్లు, గోబీస్టాళ్లను ఆమె తనిఖీ చేశారు. కొన్ని కేంద్రాల్లో ఆహార పదార్థాల్లో రసాయనిక రంగులు వాడుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఫ్రూట్ జ్యూస్ పేరుతో విక్రయిస్తున్న రంగు ద్రావకాన్ని పారబోయించారు. అనుమతుల్లేని ఏడు దుకాణదారులతో లైసెన్స్ కోసం దరఖాస్తు చేయించారు.

కేసు కొట్టివేత

హిందూపురం: కులదూషణపై బనాయించిన కేసును అనంతపురం ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం న్యాయమూర్తి కొట్టి వేశారు. హిందూపురం వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... తనను కులం పేరుతో దూషించారంటూ 2015లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లా, నాగభూషణరెడ్డి, రజనీ, నాయకులు నాగమణి, బాలాజీ, అన్సర్, రామాంజిపై త్యాగరాజనగర్‌కు చెందిన టీడీపీ నేత వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసు వాదనలు అనంతపురంలోని ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో జరిగాయి. తొమ్మిది మంది సాక్షులను న్యాయమూర్తి విచారణ చేశారు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో ఈ కేసును కొట్టి వేస్తూ న్యాయమూర్తి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పు వెలువరించారు.

దేశీయ పశుజాతి పెంపే లక్ష్యం

- సెక్స్‌డ్ సార్టెడ్ సెమన్ ద్వారా 90 శాతం పెయ్యదూడలు

అనంతపురం అగ్రికల్చర్: దేశీయ పశుజాతి ఉత్పత్తి పెంపు లక్ష్యంగా మేలుజాతి ఆంబోతుల వీర్యం ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి కార్యక్రమం అమలు చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) ఈఓ డాక్టర్ టి.సుధాకర్ తెలిపారు. మంగళవారం వారు క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రీయ గోకుల్‌మిషన్ కింద అమలు చేస్తున్న సెక్స్‌డ్ సార్టెడ్ సెమన్ (ఎస్‌ఎస్‌ఎస్) పథకం గురించి ఆరా తీశారు. గతంలో అమలు చేస్తున్న కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా సగం పెయ్య, సగం కుర్రదూడలు పుట్టేవన్నారు. అయితే కొత్తగా అందుబాటులోకి వచ్చిన సెమన్ ద్వారా కృత్రిమ గర్భోత్పత్తి చేస్తే... 90 శాతానికి పైగా పెయ్యదూడలే పుడతాయని రుజువైందన్నారు. ఈ క్రమంలో దీనిని పెద్ద ఎత్తున ప్రోత్సహించి సాధ్యమైనంత వరకు దేశీయ పశుజాతి సంతతిని అభివృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. రెండు డోసుల సెమన్ పూర్తి ఖరీదు రూ.1,350 కాగా అందులో రూ.850 సబ్సిడీ వర్తిస్తుందన్నారు. పాడి రైతులు తమ వాటా కింద రూ.500 చెల్లిస్తే రెండు డోసుల సెమన్ అందిస్తామన్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,400 డోసుల ద్వారా ఆవులు, గేదెల్లో కృత్రిమ గర్భోత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. లక్ష్యసాధనకు క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న పశుశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డీఎల్‌డీఏ డాక్టర్ టి.సుధాకర్

నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలి

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఏడీసీసీ బ్యాంక్ సిబ్బందిని ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత ఆదేశించారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పాలక వర్గం సమావేశంలో ఆమె మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు వ్యాపార లావాదేవీల లక్ష్యం రూ.2 వేల కోట్లు కాగా, ఇప్పటి వరకూ రూ.1,500 కోట్ల లక్ష్యాన్ని చేరుకున్నట్లు వివరించారు. రాబోవు రెండు నెలల్లో రూ.500 కోట్ల లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కంటే అధికంగా 7.30 శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు 7.80 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. అలాగే బంగారు నగల తాకట్టుపై గ్రాముకు రూ.3,800 చొప్పున అత్యధికంగా రుణాన్ని అతి తక్కువ వడ్డీకే అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించి బ్యాంక్ లావాదేవీలను పెంచాలని సూచించారు. పాలకవర్గ సభ్యులు శంకరరెడ్డి, రామాంజనేయులు, జనార్దనరెడ్డి, ఈశ్వరరెడ్డి, బ్యాంక్ సీఈఓ రాంప్రసాద్, జనరల్ మేనేజర్ సురేఖ రాణి, సుఖదేవ్ బాబు, రవి కుమార్, లావణ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్ పర్సన్ లిఖిత

ప్రైవేటు ఆస్పత్రి నుంచి రోగి పరారీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి నుంచి రోగి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలను సీఐ శివరాముడు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా, పుట్టపర్తి మండలం పెడబల్లి గ్రామానికి చెందిన ఆనంద్‌ను చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. లివర్ జబ్బుతో బాధపడుతున్న ఆనంద్‌ను పరామర్శించేందుకు వచ్చిన ఓ సమీప బంధువు మాటల్లో కొంత భాగం లివర్ తొలిగించే అవకాశాలుంటాయని అనుమానం వ్యక్తం చేశాడు. దీనిని నిజమని నమ్మిన ఆనంద్... సోమవారం రాత్రి బాత్‌రూమ్‌లోని కిటికీ అద్దాలు బద్ధలుగొట్టి అందులో నుంచి ఆస్పత్రి వెనుకన ఉన్న వీధిలోకి చేరుకుని, ఉడాయించాడు. సోమవారం తెల్లవారుజామున ఆనంద్ కనిపించకపోవడంతో బాత్‌రూంలోకి వెళ్లి చూశారు. అద్దాలు పగిలి ఉండడం చూసి, తప్పించుకుని పారిపోయినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, మంగళవారం సాయంత్రం 6 గంటలకు గోరంట్లలో తెలిసిన వారి ఇంటికి ఆనంద్ చేరుకున్నట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. కేవలం లివర్‌లో కొంత భాగం తొలగిస్తారనే భయంతోనే ఆనంద్ ఆస్పత్రి వదిలి పారిపోయినట్లు విచారణలో తెలిసిందని సీఐ శివరాముడు వివరించారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు


నార్పల: చిరుధాన్యాల ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్పల మండలం హెచ్.సోదనపల్లిలో చిరుధాన్యాల సాగు, ఉపయోగాలపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే చిరుధాన్యాలు ఆహారంగా తప్పక తీసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగుతో రైతులకు ఆశించిన మేర ఆదాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పూర్ణచంద్ర రావు, చంగల్‌రాయుడు, ఆత్మ పీడీ మద్దిలేటి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నాగలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీకి తలొగ్గింది చంద్రబాబే

- బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ డియోధర్

అనంతపురం టవర్‌క్లాక్: విభజన అనంతరం ఏపీకి ప్రత్యేక హోదా బదులు ప్యాకేజీ కావాలని కోరుకుని తీసుకున్నది అప్పటి సీఎం చంద్రబాబునేనని బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ డి యోధర్ స్పష్టం చేశారు. మంగళవారం అనంతపురానికి విచ్చేసిన ఆయన స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ నాయకులు నీచ రాజకీయలు చేస్తున్నారని, కుట్ర పూరితంగా బహిరంగ సభలు పెట్టి అమాయకుల ప్రాణాలు బలిగొన్నారని కుండబద్దలుగొట్టారు. రాష్ట్రాభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ క్రమంలో పార్టీని అన్ని విధాలుగా పటిష్టం చేసే చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగా ఏపీలోని అన్ని జిల్లాలు, మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో బీజేపీ ఏపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, న్యాయవాది రాఘవేంద్ర, నాయకులు దుద్దకుంట వెంటేశ్వరరెడ్డి, లలిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇష్టం లేని పెళ్లి.. యువకుడి ఆత్మహత్య



మృతుడు కాశీం

గుత్తి: ఇష్టం లేని పెళ్లికి తలొగ్గలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న మల్లేష్, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు కాశీం (28)కు షోడాల షాపులో పనిచేస్తూ తండ్రికి చేదోడుగా ఉండేవాడు. కాశీంకు ఇటీవల వివాహం నిశ్చయమైంది. ఈ నెల 23, 24 తేదీల్లో పెళ్లి చేయాలని ఇరువైపులా పెద్దలు నిర్ణయించారు. అయితే కాశీంకు ఈ పెళ్లి ఇష్టం లేదు. ఇదే విషయాన్ని తన స్నేహితులతో చెప్పుకుని బాధపడ్డాడు. పెళ్లి నిశ్చయమైనప్పటి నుంచి ముభావంగా ఉంటూ వచ్చాడు. సోమవారం అర్ధరాత్రి 2 గంటల వరకూ సెల్‌ఫోన్ చూస్తూ స్నేహితులతో చాటింగ్ చేశాడు. మంగళవారం తెల్లవారు జామున ఇంట్లోని గదిలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనతో ఎస్సీ కాలనీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎంతో మంచివాడుగా పేరున్న కాశీం ఆత్మహత్య చేసుకున్నాడని తెలుసుకున్న కాలనీ వాసులు పెద్ద ఎత్తున మృతుడి ఇంటి వద్దకు చేరుకున్నారు. మృతదేహంతో పాటు ఆస్పత్రికి చేరుకోవడంతో వైద్యశాల ప్రాంగణం కిక్కిరిసింది. ఏకైక కుమారుడి మృతితో తల్లిదండ్రులతో పాటు సోదరి రోదనలు మిన్నంటాయి. 'అన్నా లే ఒక్కసారి లేచి నన్ను చూడు' అంటూ సోదరి అంజలి రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఉరవకొండ: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం వేల్పుమడుగుకు చెందిన పురుషోత్తం రెడ్డి (55) మంగళవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా మాళాపురం వద్ద బళ్లారికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన పురుషోత్తం రెడ్డిని 108 అంబులెన్స్‌లో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.

మనోళ్లు 'శత'క్కొట్టారు

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ నేతృత్వంలో అనంత క్రీడాగ్రామం వేదికగా నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర బ్యాటర్లు చెలరేగారు. బిహార్‌పై తలపడిన ముగ్గురు బ్యాటర్లు ఏకంగా సెంచరీలు సాధించి రికార్డు సృష్టించారు. 189 పరుగులకు 4 వికెట్ల ఓవర్‌నైట్ స్కోరుతో ఇన్నింగ్స్‌ను ఆంధ్ర జట్టు ప్రారంభించింది. ఆంధ్ర బ్యాటర్లు వంశీకృష్ణ, ధ్రువకుమారరెడ్డి, కేఎస్‌ఎన్ రాజు వరుసగా సెంచరీలు సాధించి జట్టుకు పటిష్ట స్కోరును అందించారు. 304 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్‌తో వంశీకృష్ణ, 105 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో ధ్రువకుమార్‌రెడ్డి సెంచరీలు సాధించారు. అలాగే 173 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్‌తో కేఎస్‌ఎన్ రాజు 102 పరుగులతో రాణించాడు. 143.1 ఓవర్ల వద్ద 418 పరుగులకు ఆంధ్ర జట్టు ఆలౌటైంది. బిహార్ బౌలర్లలో సాహిద్ 3, వికాస్ ఝా, మయాంక్ కుమార్, ఆమోద్‌యాదవ్ చెరో 2 వికెట్లు కూలదోశారు. తొలి ఇన్నింగ్స్‌లో 9 పరుగుల ఆధిక్యాన్ని ఆంధ్ర జట్టు సాధించింది.

వైఎస్సార్‌ఈఏ నూతన కమిటీ ఎన్నిక



ఎంపికైన వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం క్రైం: వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (వైఎస్సార్‌ఈఏ) అనంతపురం ఆర్టీసీ డిపో నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపికైన వారిలో డిపో చైర్మన్‌గా పి.రామకృష్ణ, అధ్యక్షుడిగా జి.వెంకటేష్, కార్యదర్శిగా బి.సోమశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వీఎం కృష్ణ, సహాయ కార్యదర్శులుగా కె.నారాయణ, భీమలింగ, ప్రచార కార్యదర్శిగా ఎంవీ స్వామి ఉన్నారు. అలాగే రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం సుందర్రాజు, సభ్యుడిగా ఎం శివయ్యను ఎన్నుకున్నారు. ఎన్నికను రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వీ భాస్కరరెడ్డి, గోపాల్ పరిశీలించారు.

ముగిసిన జీఎన్‌ఎం ప్రవేశాల కౌన్సెలింగ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన జీఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సు ప్రవేశాల భర్తీ కౌన్సెలింగ్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 585 సీట్లకుగాను 526 సీట్లు భర్తీ అయ్యాయి. వారికి అలాట్‌మెంట్ లెటర్లను అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.